క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శివనామస్మరణ



ఆత్మకూర్: స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి స్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి లక్షబిలోపత్ర, అభిషేకం తదితర పూజ కార్యక్రమాలను శివ మాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా శివ నామస్మరణతో ఆత్మకూర్ పులకించిపోయింది. రాత్రి పట్టణంలోని పురవీధులగుండా స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు.

స్వయం పరిపాలన దినోత్సవం



పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్తసూగూరులోని మండగేరి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థుల నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దయానంద్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కొత్తకోట రూరల్: చదువుకునే విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో గల బీసీ బాలుర హాస్టల్లోని విద్యార్థులకు మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు గంజాయి, సిగరేట్ పీల్చడం, జులాయిగా తిరగడం, మద్యం తాగడం లాంటి వ్యసనాలకు బానిసలైతే చదువు అటకెక్కుతుందని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



పాన్గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్బీఎస్కే) ద్వారా సోమవారం రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆర్బీఎస్కే డాక్టర్ హరీష్ తెలిపారు. పరీక్షలు నిర్వహించి రక్తహీనత నిర్ధారించి అవసరమైన వారికి ఐరన్ ఫోలిక్, సీ విటమిన్ మాత్రలను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే సిబ్బంది ఉమ, స్వప్న, వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు సంధ్య, ప్రమీల పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



ఆత్మకూర్: యువజన కాంగ్రెస్ మున్సిపాలిటీ కార్యవర్గాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు తులసీ రాజ్యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సంగేపాగు వంశీని నియమిస్తూ నియమాక పత్రం అందజేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాహుల్గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, షబ్బీర్, నల్గొండ శ్రీను, గణేష్, లక్ష్మీకాంత్రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తెలుసుకునేందుకు సోమవారం గ్రామంలో అధికారులు పర్యటించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించిన ఆయన సత్వర నీటి వసతి ఏర్పాట్లపై అధికారులను పంపించినట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ దేవన్న, పంచాయతీ కార్యదర్శి కుర్మయ్య పాల్గొన్నారు.





పెబ్బేరులో..



వనపర్తిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్రెడ్డి

శివాజీ యువతకు ఆదర్శం

వనపర్తి టౌన్: భారతదేశం గర్వించే విధంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా హైందవ సంస్కృతిని పెంపొందించిన మహనీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని మాజీ మంత్రి నిరంజన్రెడ్డి అన్నారు. సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజామహల్ ఎదురుగా ఉన్న శివాజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగదాంబ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్గౌడ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, పాకనాటి కృష్ణ, చెన్న రాములు, నాయకులు ఉంగ్లం తిరుమల్, ఎల్ఐసీ కృష్ణ, పరంజ్యోతి, గులాం ఖాదర్ ఖాన్, ప్రేమ్నాథ్రెడ్డి పాల్గొన్నారు.

మొఘల్లపై పోరాటం అసమానం

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి టీజేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారామ్ప్రకాశ్, గిరిరాజాచారి, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, బాలస్వామి నాయుడు, పరమేశ్వరచారి పాల్గొన్నారు.

హిందూవాహిని ఆధ్వర్యంలో..

పట్టణంలో యువకులు శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులర్పించి, కాషాయం రంగు జెండాలతో శివాజీ పేరు స్మరిస్తూ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కేంద్రంలో శోభా యాత్ర కార్యక్రమాన్ని కన్నులపండుగగా నిర్వహించారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామణమ్మ, డాక్టర్ లక్ష్మీజీ శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్ యాదవ్, శ్రీను, నాగోజీ, మోహన్, భీమయ్య శెట్టి, వివేకానంద పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పలువురు నాయకులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప దేశభక్తుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి, మున్సిపల్ ఫ్లోర్లీడర్ అశ్విన్కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్లో యువకులు, సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలు, నర్సింహ, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: స్థానిక బస్టాండు ఆవరణలో సామాజిక కార్యకర్త కుమ్మరి గోపి ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి, అప్పారెడ్డిపల్లిలోని శివాజీ విగ్రహానికి యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరచింత: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయను కొనసాగిద్దామని మున్సిపల్ చైర్పర్సన్ మంగమ్మ, శివాజీ పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్ అన్నారు. పట్టణంలో శివాజీ కమిటీ, హిందువాహిని ఆధ్వర్యంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యాదగిరి, కౌన్సిలర్ లక్ష్మి, పొరుపల్లి ఉషారాణి, క్యామ భాస్కర్, తాటికొండ రమేష్, కేజీ మహేందర్ రెడ్డి, రామూర్తి, వినోద్ కుమార్, కుమ్మరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్లో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్పర్సన్ గాయత్రి



ఖిల్లాఘనపురంలో..



చిన్నంబావిలో..



అమరచింతలో..

సేవాభావంతో పనిచేస్తేనే గుర్తింపు



వీపనగండ్లలో ఎంపీడీఓ కతలప్పను సన్మానిస్తున్న ఎంపీపీ కమలేశ్వర్రావు



ఆత్మకూర్లో..

వీపనగండ్ల: గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీఓలు కీలక పాత్ర వహిస్తారని, సేవాభావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని ఎంపీపీ కమలేశ్వర్రావు అన్నారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఇటీవల బదిలీ అయిన ఎంపీడీఓ కతలప్పకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, సమాజంలోని రుగ్మతలను నిర్మూలించి చైతన్య పరచడంలో అధికారులదే కీలక పాత్ర అని అన్నారు. ఎన్ని రోజులు పనిచేశామన్న అంశాన్ని పక్కకు పెట్టి ప్రజలకు అందించే సేవల ద్వారానే వారిని ప్రజలు స్థిరంగా గుర్తుంచుకుంటారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, ఎంపీటీసీ భాస్కర్రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండల ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు సేవలు అమోఘమని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి కొనియాడారు. సోమవారం బదిలీపై మెదక్కు వెళ్లిన ఎంపీడీఓకు స్థానిక కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్సింగ్, విరేషలింగం, రవియాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



బుసిరెడ్డిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్నాయక్

అమరచింత: హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శులతో పాటు ఈజీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీఓ కార్యలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో హరితహార మొక్కల సంరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఆయన గ్రామాల వారీగా ఇప్పటి వరకు నాటిన మొక్కలు ఎన్ని, ఎన్ని బతికి ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాలు పూల, పండ్ల మొక్కలు లభించేలా వాటిని పెంచాలని సూచించారు. మొక్కలు వాడుముఖం పడితే ఆయా గ్రామాల కార్యదర్శులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు, ఈజీఎస్ ఈసీ రఘులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాన్గల్: హరితహారంలో నాటిన, నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంఈఓ, జీపీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్నాయక్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలోని నర్సరీ, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున క్రమం తప్పకుండా నీటిని పట్టాలన్నారు. దీంతో పాటు పారిశుద్ధ్య నివారణ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.

నేటినుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల వెంకటగిరి క్షేత్రంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు (జాతర) నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 380 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయంలో వెలసిన స్వామివారు సంతాన సౌభాగ్య కల్యాణ వేంకటేశ్వరస్వామిగా విరజిల్లుతున్నారు. ఎవరికి ఏ శుభకార్యాలు కలగాలన్నా, కుటుంబంలో బాధలు తొలగిపోవాలన్నా స్వామి వారిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగి మంచి జరుగుతుందని ఇక్కడి భక్తుల నమ్మకం.



ముస్తాబైన వెంకటగిరి దేవాలయం

కార్యక్రమ వివరాలు

20న అంకురార్పణ, అంకుర హోమం, 21న ధ్వజారోహనం, భేరిపూజ దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, హోమం, బలిహరణం, 22న శ్రీశ్రీశ్రీ భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 23న మూలమంత్ర హోమం, బలిహరనం, సాయంత్రం 4గంటలకు రథాంగహోమం, 24న రథోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వేదాంతం శంకరాచార్యులు తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పాన్గల్: ప్రతి విద్యార్థి రెగ్యులర్గా పాఠశాలకు హాజరు అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాలలకు సక్రమంగా రాకుండా గైర్హాజరవుతున్న విద్యార్థులపై దృష్టి సారించి ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని బడికి సక్రమంగా హాజరు అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు దేవుజా, నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభివృద్ధికి పూర్తి సహకారం



అమరచింత: స్థానిక పురపాలిక అభివృద్ధికి తనవంతు కృషి చేయడమేగాక ప్రభుత్వపరంగా నిధులు తీసుకొస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం పుర చైర్పర్సన్ మంగమ్మ, కమిషనర్ మక్తల్లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మంగళవారం జరిగే పుర బడ్జెట్ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పురపాలికను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందుకురావాలని వివరించారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

ఖిల్లాఘనపురం: వరిలో ప్రస్తుత పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో పాటుగా నివారణకు పురుగు మందులు వాడాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. సోమవారం ఏఓతో పాటుగా ఏఈఓలు మండలంలోని పలుగ్రామాల్లో పర్యటించి వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చీడపీడల నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతు మండలంలో చాలా గ్రామాల్లో వరి పంటలను పరిశీలించామన్నారు. ఎక్కువగా వరి పంటకు కాండం తొలుచు పురుగు, జింకు లోపం, ఎండు తెగులు సోకిందని తెలిపారు. కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు లేదా 400 గ్రాముల మందును పంటపై పిచికారీ చేయాలన్నారు. అధికారులు సూచించిన మందులు మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు బాల్రాజు, మాధవి, మహేష్, పాండు, వంశి, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఓటరు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట రూరల్: ఏప్రిల్ 1, 2024 నాటికి 18ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ సూచించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారి వికాస్రాజ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, ఓటరు తుది జాబితా విడుదల తర్వాత ఆయా జిల్లాలో భారీగా కొత్త ఓటర్లు నమోదు, తొలగింపు కోసం దరఖాస్తులు రావటంపై వికాస్రాజ్ ఆరా తీశారు. పార్లమెంట్ ఎన్నికలకు తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బంది వివరాలు తీసుకుని ఎఫిక్ నెంబరుతో సహా ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. అగ్జలరి పోలింగ్ స్టేషన్ల అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రచురించి అన్ని పోలింగ్ స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించామన్నారు. ఒకవేళ ఎవరిదైనా ఎఫిక్ కార్డు పోగొట్టుకొని ఉంటే వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వనపర్తి జిల్లాలో తుది ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత ఇప్పటి వరకు 4,431 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఫాం 6, 7, 87 ఉన్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ సంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విధులు అంకితభావంతో నిర్వర్తించాలి



ఉద్యోగార్థులను సన్మానించిన ప్రముఖులు, జేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన 11మంది స్టాఫ్ నర్సులుగా, ఒకరు గురుకుల టీచర్గా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సాధించిన వారికి జేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డాక్టర్ కృష్ణకుమార్రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన వారికి అంబేడ్కర్ చిత్రపటాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు భక్తరాజు, అమృతరాజు, దయానందరాజు, మహిమరాజు, సతీష్రాజు, ఎస్ఆర్.ప్రేమయ్య, కో ఆప్షన్ సభ్యులు మిషేక్, గాడీల ప్రశాంత్, కిరణ్, కర్ణకుమార్ తదితరులు ఉన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం రేవంత్రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: అసెంబ్లీలో బీసీ సమగ్ర బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్తకోట చౌరస్తాలో సీఎం రేవంత్రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులగణనకు అసెంబ్లీలో అమోదం తెలిపిన ప్రతి ఎమ్మెల్యేకు బీసీల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఉమ్మడి, ప్రత్యేక రాష్ట్రంలో బీసీలు వివక్ష గురయ్యారని, ఎన్నికల హామీలో ఇచ్చినట్లుగా సీఎం రేవంత్రెడ్డి కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో, స్థానిక ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్య ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు బాలరాజుగౌడ్, యాదన్న, రాములు, ఆశన్న తదితరులు ఉన్నారు.

ప్రతిభ గుర్తింపునకే పోటీ పరీక్షలు



పాన్గల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు



అమరచింతలో..

అమరచింత: ఎఫ్పీఎస్టీ, టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అమరచింత, మస్తీపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జెడ్పీహెచ్ఎస్ అమరచింతలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆఫ్నా మొదటి స్థానం, మస్తీపురం జెడ్పీహెచ్ఎస్లో ఎనిమిదో తరగతి చదువుతున్న లక్ష్మి రెండో స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్ఎం బలరాముడు తెలిపారు. మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయిలో ఈనెల 21న నిర్వహించే టాలెంట్ టెస్ట్లో పాల్గొంటారని తెలిపారు.

పాన్గల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాన్గల్ కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్పీఎస్టీ), తెలంగాణ బయోసైన్స్ ఫోరం (టీబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సైన్స్ పోటీలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గణేష్, పాన్గల్ బాలికల ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని హారిక, బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి జస్వంత్ మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 21వ తేదీన జరిగే జిల్లా స్థాయిలో పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలి



కనిమెట్టలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఎంపీపీ మౌనిక, ప్రోగ్రాం అధికారిని బేబీ రాణి



వెల్టూర్లో..

కొత్తకోట రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథం అలవరుచుకోవాలని ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎన్ఎస్ఎస్(యూనిట్-1) క్యాంపును మండలంలోని కనిమెట్టలో ఆరురోజులు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీపీ గుంత మౌనిక హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని బేబీ రాణి, పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య, గ్రామస్తులు పరమేష్, పరశురాములు, మన్నెంకొండ, శివయాదవ్, శ్రీనివాస్రెడ్డి, ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్టూర్లో..

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ (యూనిట్-2) క్యాంపు పెద్దమందడి మండలంలోని వెల్టూర్లో ఆరు రోజులుగా నిర్వహించారు. సోమవారం చివరి రోజు స్థానిక హైస్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సామాజిక ఆర్థిక అనర్థాల గురించి వివరించారు. బొప్పాయి పండుతో టూటీ ఫ్రూటీ, టమాటాలతో టమాట సాస్ చేసే విధానం గురించి గ్రామస్తులకు విద్యార్థులు వివరించారు. ఆరు రోజుల పాటు ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్రెడ్డి, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

రోడ్లు వేశారు.. క్యూరింగ్ మరిచారు

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తూ క్యూరింగ్ చేపట్టకుండా వదిలేస్తున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్లో భాగంగా మండలానికి రూ.2.68 కోట్ల నిధులు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో వారం రోజులుగా సీసీ రోడ్లు వేస్తున్నారు. రోడ్లు వేసి మూడు నాలుగు రోజులు కావస్తున్నా క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయంలో ట్యాంకర్ లేదా నల్లా పైపులతో కొంత సేపు నీళ్లు పట్టి వదిలేస్తున్నారని చెబుతున్నారు. రోడ్లపై సిమెంటు లేదా కనీసం మట్టితోనైన కట్టలు కట్టి నీటిని నిల్వ ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. కమాలోద్దీన్పూర్లోని అంజనేయస్వామి జాలయం వెనకాల, ఖిల్లాఘనపురం పెట్రోల్ బంకు వెనకాల వైపు ఇలా చాలా గ్రామాల్లో రోడ్లకు క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదంటున్నారు. ఇలాగే వదిలేస్తే రోడ్లు మూన్నాళ్లకే పగుళ్లు వస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ కబీర్దాస్ను వివరణ కోరగా సీసీరోడ్లు పూర్తయిన గ్రామాల్లో వెంటనే కట్టలు కట్టిస్తామని తెలిపారు. ఎక్కడైనా కట్టలు కట్టకుండా ఉంటే వెంటనే ఆయా గ్రామాల్లో పరిశీలించి కాంట్రాక్టర్కు తగు సూచనలు చేస్తామన్నారు.



ఖిల్లాఘనపురంలో పైపుతో నీటిని పట్టి వదిలేసిన సీసీ రోడ్డు